

కథా కౌముది

# కృష్ణక్కయ్య

అజ్ఞాని

ఇది ఈ రోజుల కథ కాదు. అరవై, అరవై ఐదు సంవత్సరాల క్రితం నాటిది. సెల్ ఫోన్లూ, ఇంటర్నెట్, టివి, దేశం ఈ చివరినుంచి ఆ చివరి దాకా పరిగెత్తే సూపర్ ఫాస్ట్ రైళ్ళూ ఏవీ లేని కాలం.

★★★

అది 1962వ సంవత్సరం అనుకుంటాను. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజి ప్రవేశ రుసుము కట్టాల్సిన ఆఖరి రోజు. మర్నాట్నించీ క్లాసులు ప్రారంభం. ఎక్కౌంట్సాఫీసు కిటకిటలాడిపోతున్నది ఫీజు కట్టడానికి వచ్చిన వాళ్ళతో. చాలామంది కుర్రాళ్ళు వాళ్ళ వాళ్ళ నాన్నలతో వచ్చారు. వాళ్ళందఱితో లైను మెల్లి మెల్లిగా కదుల్తోంది. వాళ్ళందరి మధ్యా బితుకు బితుకుమంటూ నిల్చున్నారు పరంధామయ్య గారూ కూతురు కృష్ణప్రియా. హాలంతటిలో మరో ఆడ పురుగు కనిపించడంలేదు, అందరి కుర్రాళ్ళ చూపులూ తన కూతురి మీదేనని గమనించిన ఆయనకి ఇంట్లో భార్య ముందు ప్రదర్శించిన ధైర్యమంతా నీరు గారి పోయింది.

ఆడపిల్లనైతే నేం నా ఇష్టప్రకారం ఇంజినీరింగే చేస్తాను అని అమ్మతో పోట్లాడిన కృష్ణకి కూడా క్లాసంతటిలో తనొక్కత్తినే ఆడ పిల్లనౌతానూ అని ఊహించక పోవడంతో ఇలా ఏదో జూ లో జంతువు లాగా బతకాలా ఈ నాలుగేళ్ళూ అని ఠారు పుట్టింది. అమ్మ అన్న మాటలన్నీ అశరీర వాణి పలుకుల్లాగా చెవుల్లో గింగురుమంటున్నాయి.

కృష్ణప్రియ వాళ్ళమ్మ గారు అనసూయమ్మ గారికి ప్రసవం చాలా కష్టమైంది. ఇంకో ప్రసవమైతే ప్రాణానికే ముప్పు కావచ్చన్నారు, అప్పటి వైద్యులంతా. ఒక్కగానొక్క కూతురవడంతో దంపతులిద్దరూ చిన్నప్పుడు కొంత గారాబం చేశారనక తప్పదు. కానీ అన్నింట్లోను ధైర్యంగా ముందుకెళ్ళే ఆ పిల్లని ఎలా పెంచాలి అన్న విషయంలో ఇద్దఱికీ తేడాలొచ్చాయి.

కృష్ణప్రియ స్ఫురద్రూపి. చూడాగానే మళ్ళీ చూడాలనిపించే కళ కల ముఖం. అంతే కాక చిన్నప్పటి నుంచీ కొంచెం పొడుగు కూడా ఎక్కువ. తన పదో యేటప్పుడు నాకు పన్నెండేళ్ళని ఎందుకనుకుంటారు అందరూనూ అని కోపం తెచ్చుకునేది.

పెద్దయ్యే కొద్దీ పొడుగుతో పాటు దీనికి పొగరు కూడా పెరుగుతోంది అని అనసూయమ్మ గారు బాధ పడుతుంటే, నా కూతురు 'రాజా బేటీ', క్రికెట్ కూడా ఆడుతుంది అని మురిసి పోయే వారు పరంధామయ్య గారు.

"అసలు దాని ఒళ్ళు పొగరంతా మీ గారాబం వల్లనే. లేకపోతే ఆడపిల్ల కి ఇంజినీరింగేమిటండీ, హాయిగా డాక్టరు కాకుండాను. రేపు దాని పెళ్ళెలా చేద్దామనుకుంటున్నారూ? ఇంజినీరైన పిల్లని ఎవరు చేసుకుంటారూ? నాకిష్టమని అదనగానే మీరొప్పేసుకోవటమేమిటి?" అని అనసూయమ్మ గారు నెత్తి నోరూ కొట్టుకోని రోజు లేదంటే అతిశయోక్తి కాదు.

"మీ కాయితాలన్నీ వరసగా పెట్టివ్వండి, డబ్బు సరిగ్గా లెక్కపెట్టివ్వండి, అందటికీ ఇవ్వడానికి మా దగ్గఱ చిల్లరుండదు. హాస్టల్లో ఉండే వాళ్ళు హాస్టల్ ఫీజూ డిపాజిట్టూ అంతా కలిపి ఇవ్వండి. తొందరగా పని కానివ్వండి" అంటూ తిరుపతి పూజారి లాగా అందరినీ దబాయిస్తూ విసుక్కుంటూ పని కానిస్తున్నారు గుమాస్తాలందరూ.

కృష్ణ ప్రియ, వాళ్ళ నాన్న గారూ, ఇద్దరూ బితుకు బితుకుమంటూ మెల్లి మెల్లిగా లైన్లో ముందుకు సాగుతున్నారు. ఎంతో సేపటికి కిటికీ దగ్గరకి చేరుకునేటప్పటికి, వాళ్ళని చూసి గుమాస్తా చటుక్కున లేచి నిల్చుని "ఈ గొడవలో మిమ్మల్ని చూడలేదు క్షమించండి, పొద్దున్నే ప్రిన్సిపాల్ గారు వచ్చి, మీరు రాగానే తన దగ్గరికి పంపించమని చెప్పారండి" అన్నాడు.

"అప్పలకొండా..! అయ్యగారినీ అమ్మాయినీ ప్రిన్సిపాల్ గారి దగ్గరికి తీసుకెళ్ళు. మీరు విశాఖపట్నం వారే కదా, అంటే హాస్టల్ అక్కర్లేదు. కేవలం కాలేజీ ఫీజే కడ్తున్నారు. నేను అన్నీ చూసుకుని మీ చిల్లరా రశీదు అవీ అక్కడికే పంపిస్తాను సార్". అన్నాడు వినయంగా. పరంధామయ్య గారికీ అదంతా కలలా అనిపించింది. ప్రిన్సిపాల్ గారేంటి తనని రమ్మనడమేమిటి? అసలాయనకి తనెలా తెలుసో!

ఆఫీసులోకి వెళ్ళగానే ప్రిన్సిపాల్ కృష్ణా రావు గారు లేచి

"పరంధామయ్య గారూ.. రండి రండి" అని పిలిచారు. "మీ పేరెట్లా తెలిసిందా అని తత్తర పడకండి. రెండు వందల మంది బాచ్ లో ఒక్కగానొక్క ఆడపిల్ల, ఆ అమ్మాయి ఊరూ పేరూ అన్నీ చూశాను, అమ్మాయిని చేర్చడానికి మీరు రాకుండా ఉండరనీ ఊహించాను. నేనూ ఇద్దరాడపిల్లల తండ్రినండీ" అన్నారు కలుపుగోలుగా.

తన ప్యూన్ ని పిలిచి," అమ్మాయికి మన గదిలోనే ఆ మూల ఓ చిన్న బల్లా కుర్చీ వెయ్యి. లంచ్ టైం లో ఇక్కడే కూర్చుంటుంది" అని వెంటనే ఏర్పాటు చేశేశారు.

"పొద్దున్న రాగానే నీ లంచ్ బాక్స్ ఇక్కడే పెట్టుకెళ్ళమ్మా, క్లాసులన్నిట్లోకీ మోసుకెళ్ళక్కర లేదు" అని కూడా ఆప్యాయంగా చెప్పారు.

వెంటనే సింహాచలం కూడా తన పాత్రని అర్ధం చేసుకున్నాడా అన్నట్లుగా, "చూడమ్మా కుర్రాళ్ళెవరన్నా వెధవ్వేషాలేస్తే మాష్టారిక్కూడా చెప్పక్కర్లేదు నాకు చెప్పు చాలు వాళ్ళ పని పడ్తాను", అని తనవైపు నుంచి అభయమిచ్చాడు.

పరంధామయ్య గారు తన తరపున సంజాయిషీ చెప్పుకున్నారు, "అప్లై చేసినప్పుడు మా అక్కయ్య కొడుకు ఒకడు ఇక్కడ లెక్చరర్ గా ఉండేవాడండీ. వాడు ఒక అండగా ఉంటాడనుకున్నాం. వాడేమో కాకినాడలో మా బావకి జబ్బు తిరగబెట్టడంతో అక్కడికి ట్రాన్స్ఫర్ చేయించుకుని వెళ్ళిపోయాడు" అని.

"సుబ్రహ్మణ్యం మాష్టారు మీ మేనల్లుడా? " అన్నారు రామనాథం గారు.

"అవునండీ, వాడు మీకు తెలుసా? " అన్నారు పరంధామయ్య గారు ఆనందంగా.

"తెలియకపోవడమేమిటండీ, మా స్టాఫే కదా. తన ట్రాన్స్ఫర్ గురించి ఒకటి రెండు సార్లు నాతో మాట్లాడాడు కూడానూ. నేను కూడా కాకినాడ కాలేజి ప్రిన్సిపాల్ గారితో చెప్పాను, పాపం నిజమైన కేసండీ, వాళ్ళ నాన్న గారి ఆరోగ్యం బాగోక అడుగుతున్నాడు వీలైనంత సహాయం చేయండీ అని"

"ఇదిగో చూడమ్మా, ఒక్కత్తినీ ఉన్నానని ఏమీ భయపడకు. అప్ప్లై చేసినప్పుడెలా ధైర్యంగా చేశావో అలాగే ఈ నాలుగేళ్ళూ ధైర్యంగా ఉండు. అన్నట్లు మరచాను. మా ఇద్దరమ్మాయిలకి నువ్వొక పెద్ద హీరోయిన్ వైపోయావమ్మా. నీతో మాట్లాడాలని తెగ ఆతురతగా ఉన్నారు. మా ఆవిడ శ్రావణ శుక్రవారం పేరంటానికి నిన్ను పిలుస్తుందట, నువ్వు మీ అమ్మ గారితో కలిసి రావాలట, వాళ్ళిద్దరూ వేసే ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పాలట" అన్నారు.

"తప్పకుండా వస్తాను సర్", అని సంతోషంగా జవాబు చెప్పింది కృష్ణప్రియ.

అమ్మాయికలా ఇద్దరంగరక్షకులు *కుదరటంతో* హుషారుగా నడుస్తూ తృప్తిగా గాజువాక బస్సెక్కి ఇంటికి బయల్దేరారు పరంధామయ్య గారు, కూతురూనూ.

ప్రిన్సిపాల్ కృష్ణారావుగారి అండ ఉండడంతో కొన్ని బాధలు తప్పాయి కానీ క్లాసులో ఒక్కత్తికీ బితుకు బితుగ్గానే ఉండేది. సరే రోట్లో తలపెట్టింతరువాత రోకలి పోటు కి భయపడితే ఎలా అని భరించేది. తనకి మొత్తం మీద మంచి మార్కులు వస్తూండడంతో అబ్బాయిల నోళ్ళు కూడా కొంత మూతలు పడ్డాయి.

★★★

ఇంతలో సాంస్కృతికోత్సవాలు వచ్చాయి. అప్పట్లో ఆంధ్రా యూనివర్సిటీలో అవి ఒక పెద్ద సంగతి. ఒక వారం రోజులు ప్రతి రోజూ నాటకాలూ, సంగీత కార్యక్రమాలూ హోరెక్కిపోతుంది. ఆ సంవత్సరం కాకినాడ కాలేజీ వాళ్ళు వేసిన 'నాలుగిళ్ళ చావిడి' నాటకం అందటికీ నచ్చింది. కృష్ణప్రియకి అందులో చిన్న కుఱ్ఱాడుగా వేసినతను ఎందుకో బాగా నచ్చాడు. ఆ కుఱ్ఱాణ్ణి ప్రేమించేస్తున్నావా అంటూ ఆటలు పట్టించేశారు తన ఫ్రెండ్సందరూనూ. నాటకానికీ, సినిమాకీ, జీవితానికీ తేడా లేదేమిటీ అంటూ రోషంగా తేల్చేసింది తను.

చూస్తూ చూస్తుండగానే ఆ సంవత్సరం తిరిగిపోయింది. ఆ వేసవిలో వచ్చింది పరంధామయ్య గారి రాష్ట్ర ప్రభుత్వోద్యోగంలో కాకినాడ కి బదిలీ. ఆర్డర్ వచ్చిన మర్నాడే ప్రిన్సిపాల్ కృష్ణారావు గారిని కలియడానికి వెళ్ళారాయన. "అయ్యో అయ్యో అంత కన్నానా, కాకినాడ కాలేజీలో అమ్మాయి క్లాసులో నలుగురాడ పిల్లలున్నారు మంచి కంపెనీ ఉంటుంది" అని వెంటనే ట్రాన్స్ఫర్ అప్లికేషన్ పెట్టించేశారు. నిజం చెప్పద్దూ, నెత్తి మీద నుంచి ఒక పెద్ద భారం వదిలిందనిపించిందో ఏమిటో ఆయనకి.

"అమ్మయ్య, అమ్మాయికి ఒంటికాయ సొంటి కొమ్ము గతి తప్పుతుంది" అని సంతోషపడ్డారు పరంధామయ్య గారు. "అది బావుంది కానీ కొత్త ఊరూ, కొత్త కాలేజీ, కొత్త స్నేహాలూ ఎలా ఉంటాయో" అని అటూ ఇటూ ఐంది కృష్ణప్రియ. మళ్ళీ ట్రాన్స్ఫరూ, మళ్ళీ పెటే బేడా సర్దుడూ, మళ్ళీ అద్దిళ్ళ వెతుకుడూ ఈ ఉద్యోగంలో ఈ జీవితంలో తప్పదు మనకి అని విసుక్కున్నారు అనసూయమ్మ గారు.

★★★

ఇదిగో 'ఈ పెంకి పిల్లతో ఎన్ని పాట్లు పడ్తున్నావో చెప్పుకోడానికి ఓ కొత్త పిన్ని గారు, కొత్త బామ్మ గారు దొఱుకుతారు నీకు' అని తీర్మానించింది కృష్ణప్రియ కాకినాడ వెళ్ళగానే. అనసూయమ్మ గారు 'మరే, అది తప్ప నాకింకో పని లేదు' అని చిన్నబుచ్చుకున్నారు గానీ చివరకు జరిగిందదే ఐంది. కాకినాడ లో అద్దింట్లో దిగిన నాల్రోజులకే ఇరుగు పొరుగుల తో స్నేహాలు, కబుర్లూ కాకరకాయలూ, కష్టసుఖాలు కలబోసుకోడాలు అన్నీ మామూలుగా జరిగిపోయాయి.

ఒక్కటే అనుకోని విషయం, ఎదురు సందులో మూడో ఇంట్లో సీతమ్మ గారబ్బాయి శ్రీనివాస్ కృష్ణప్రియ క్లాసు. ఆ సంగతి తెలియగానే 'వెళ్ళి కలుద్దాం రా' అని బయల్దేర దీశారు అనసూయమ్మ గారు. 'పక్కింటబ్బాయి' క్లాస్ మేటైతే ఏం గొడవలొస్తాయో బాబూ అంటూ రానంది కానీ అమ్మ మాట వినక తప్ప లేదు.

తీరా వెళ్తే ఆ కుఱ్ఱాడు ఇంట్లో లేడు. అనసూయమ్మ గారికి అది పెద్ద సమస్య కాలేదు. ఆవిడది కలుపుగోలు స్వభావం, అందఱితోనూ మాటలు కలపగలరు కలివిడిగా మాట్లాడగలరు. కృష్ణకది ససేమిరా నచ్చదు. వాళ్ళ మాటలు వింటుంటే ముళ్ళ మీదున్నట్లుండి బయట వసారాలోకెళ్ళి కూర్చుంది విసుగ్గా.

ఇంతలో బజారుకెళ్ళిన శ్రీనివాస్ క్లాస్ లో తన తోటి వాడు హుసేన్ తో కలిసి తిరిగొచ్చాడు. అతను గేటు తలుపు తీస్తుండగానే ఏమిటబ్బా ఈ కాసిని నెల్లల్లోనే ఇతనింత పొడుగు పెరిగాడు అనుకుంది ఒక్క క్షణం. బాగానే ఉంది ఇతనెవరని ఇలా అనుకుంటున్నాను అని తనలో తను నవ్వుకునేలోపలే అతన్ని పూర్తిగా గుర్తు పట్టి, అనాలోచితంగా పలకరించేసింది,

"నాలుగిళ్ళ చావిడి నాటకంలో కుఱ్ఱాడి వేషం వేసింది మీరే కదూ" అని.

ఎవరో ముక్కూ ముఖం తెలియని ఆడపిల్ల తనింటి వసారాలో కూర్చుని తననిలా హఠాత్తుగా పలకరించేటప్పటికి కంగు తిన్నాడతను. కృష్ణకి వెంటనే తను చేసిన తప్పు అర్థమై, "సారీ అండి, నేను, నేను" అంటూ తన పరిచయం వగైరా చేసుకుంది.

మాట తడబడటం కృష్ణప్రియ కి జీవితంలో మొదటిసారేమో.

అతని వేషం, నటనా తనకంత నచ్చేశాయి, తన మీద అంత ముద్ర వేశాయీ అని అప్పుడే అర్థమైంది.

తన నటన అంత నచ్చేసిన ఆ ఆడపిల్లతో, అక్కడే కూర్చుని కాలేజీ కబుర్లు చెప్పడం మొదలు పెట్టాడు శీను.

వసారాలో మాటలు విని వాళ్ళ బామ్మ గారు అటుగా వచ్చి "ఏమిట్రా బజారు నించి తెచ్చిన సరుకులు ఇంట్లో ఇవ్వకుండా ఇక్కడే కబుర్లలో పడ్డావు" అని సున్నితంగా కోప్పడ్డారు.

"అదే బామ్మా ఈవిడ పలకరిస్తేనూ" అంటూ నసిగాడు.

"పక్కింటమ్మాయిని ఈవిడా మీరూ అని మర్యాదలేమిట్రా, హాయిగా కృష్ణక్కయ్యా అని పిలువు. నువ్వు కూడా వాణ్ణీ శీనూ అని పిలువమ్మా" అని వరస కలిపేశారు బామ్మ గారు.

ఓహో 'అక్కయ్యా' అని పిలిచి ఏడిపించచ్చన్నమాట అని సంతోషం వేసింది శీనుకి, పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్లైంది కృష్ణకి. తన పొడుగు పెద్ద అనర్థానికే దారి తీసిందనిపించింది. 'మనం ఒకే క్లాసు వాళ్ళం కాబట్టి, నేను మీకన్నా పెద్ద దాన్నేం కాను. ప్లీజ్ నన్ను అక్కయ్యా అని పిలవద్దు' అని వేడుకుంది బామ్మ గారు లోపలికి వెళ్ళగానే. 'సరే అక్కయ్యా అలాగే' అని ఉడికించాడు.

మాట వరసకి ఏర్పడిన ఆ పిలుపు, ఆ వరసా వాళ్ళ మధ్య మామూలైపోయింది. శీనుకే కాదు, శీనూ వాళ్ళ గేంగ్ లో పదిమందికీ కూడా అక్కయ్యైపోయింది కృష్ణప్రియ అతి త్వరలో. మొదట్లో కొన్నాళ్ళు అలా పిలవద్దూ అనిమొర పెట్టుకుంది కానీ ఫలితం లేకపోయింది.

'అక్కయ్యా అన్న ఆ పిలుపు నువ్వు మానవు కదా' అని నిష్ఠూరమాడింది ఎన్నో సార్లు శీనుతో.

"పడిన అలవాటు మారింది కాదు" అని సంజాయిషీ చెప్పుకున్నాడు శీను. క్లాసులో మిగతా వాళ్ళు కూడా వీళ్ళ గేంగ్ ని అక్కయ్య గారి తమ్ముళ్ళు అని పిలవడం మొదలు పెట్టారు. కానీ విశాఖపట్నం లో లాగా ఇక్కడ కూడా మంచి మార్కులు రావడంతో ఆ పిలుపు గౌరవార్థం కూడా ఐపోయింది.

శీనూ వాళ్ళ నాన్న గారు సుబ్బారావు బి ఎస్ సి పాస్ అవగానే పక్కనే ఒక పల్లెలో ఉన్న పదెకరాలూ సాగు చేసుకొంటూ అమ్మా నాన్నని చూసుకుంటూ ఉన్న ఊళ్ళోనే ఉద్యోగం వెతుక్కున్నాడు. ప్రస్తుతం ఊళ్ళో ఉన్న ఒక పెద్ద సినెమా హాల్లో అసిస్టెంట్ మేనేజర్.

హుసేన్ శీనూ గేంగ్ లో డిప్యూటీ లీడర్. సుబ్బారావు గారి కి హైస్కూల్ దాకా  వాళ్ళమ్మ క్లాస్ మేట్, వాళ్ళ నాన్న గారు (బాపూ) ఒక సంవత్సరం సీనియర్ అవ్వడం తో రెండు కుటుంబాలకీ మంచి స్నేహం. హుసేన్ వాళ్ళ బాపూ హైస్కూల్ కాగానే వాళ్ళ నాన్నగారి లాగా దర్జీ ఐపోయాడు. మంచి దర్జీ అని పేరుంది కానీ పేరుకి తగ్గ సంపాదన లేదు. వాళ్ళమ్మ ఎంబ్రాయిడరీ చేస్తుంది, వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు తోడుగా. వచ్చిన దాంతో గుట్టుగా కాలం గడుపుతుంటారు.

ఒక రోజెందుకో సుబ్బారావు గారు హుస్సేన్ ని దేనికో 'అలా ఎందుకు చేశావురా' అని అడిగారు. వెంటనే పాతాళ భైరవి పోజు పెట్టి 'నిజం చెప్పమంటారా, అబద్ధం చెప్పమంటారా, చాచాజీ' అన్నాడు. వాళ్ళ బాపూ వెంటనే, సుబ్బారావ్ భాయ్, వీడికి ఎంతసేపూ హసీ మజాక్ పెరిగి పోతోంది, నా మాట వినడం లేదు నువ్వన్నా జరా బుద్ధి చెప్పు అన్నారు. సుబ్బారావు గారు, 'నవ్వినన్నాళ్ళు నవ్వనీ భయ్యా' అన్నారు విచారంగా. వాళ్ళిద్దరికీ, వాళ్ళ భార్యలకీ మాత్రమే తెలిసిన సత్యం, వాళ్ళిద్దరూ కేన్సర్ బాధితులు. అప్పట్లో దానికి సరైన చికిత్స లేదు. ఆ సర్పం ఎప్పుడు కాటేస్తుందో తెలియదు. తను బ్రతికుండగా తన కూతురు కి నికా (పెళ్ళి) చేయగలనా లేదా అని ఒక పెద్ద మనోవేదన వాళ్ళ బాపూకి.

★★★

శీనూ వాళ్ళు రెండో సంవత్సరంలో ఉండగా ఒక వార్త తెలిసింది. కాకినాడ కాలేజీ పాత కుఱ్ఱాడు ఒకతను రంజీలో సెలెక్ట్ అయ్యాడు, హైద్రాబాదులో జరిగే ఒక మేచ్ లో ఆడ్తాడు అని. వెళ్ళి చూడాలనిపించింది కృష్ణప్రియకి.

హైద్రాబాదు ప్రయాణం అంటే మాటలు కాదు. సామర్లకోట దాకా బస్సు లోనో ఆటో లోనో వెళ్ళి అక్కడ బెజవాడ బండెక్కాలి. అక్కడి నుంచి హైద్రాబాదుకి మళ్ళీ ఇంకో రైలు. సరే హైద్రాబాదులో స్టేషన్ నుంచి ఖైరతాబాద్ లో వాళ్ళ పిన్ని గారింటి దాకా సిటీ బస్సు. అంచెలంచెల ప్రయాణం. తనని ఒక్కత్తినీ ఎలాగూ పంపరు కాబట్టి శీనూని తోడు రమ్మంది. అది మెల్లిగా గేంగు గేంగంతటికీ పాకింది. కృష్ణప్రియా వాళ్ళ పిన్ని గారింట్లో ఉండి, అదీ మూడు రోజులూ

ఉండకుండా అతని బేటింగు చూడగానే తిరిగి వచ్చేటట్లు ఒప్పందం. ప్రయాణం మజిలీలతో చాలక మరో మెలిక. అందరికీ పక్క బట్టలు పిన్ని గారింట్లో ఉండవు కాబట్టి ఒక్కొక్కళ్ళూ చిన్న బెడ్డింగూ. అంతా కలిసి "కౌపీన సంరక్షణార్ధం ..." అని సామెత చెప్పినట్లైంది.

మొత్తం మీద యాత్ర విజయవంతంగా జఱిగింది. ఒక గొప్ప పని చేయ గలిగామని తృప్తి కలిగింది అందరికీనూ. దాంతో 'అక్కయ్య' మీద ఇంకా గౌరవం పెరిగిపోయింది అందరికీ. కానీ మీరిదంతా ఒప్పుకున్నారని వాళ్ళమ్మ గారొకటే దుమారం వాళ్ళ నాన్న గారి మీద.

★★★

ఆ వేసవి లో ఒక పెద్ద దుర్వార్త, హుసేన్ వాళ్ళ బాపూ పోయారు. వాళ్ళ కుటుంబం ఉన్న ఇల్లు ఖాళీ చేసి ఓ చిన్న రెండు గదుల పోర్షన్ లోకి సర్దుకున్నారు. వాళ్ళమ్మ ఎంబ్రాయిడరీ యే ఆదాయమైంది కుటుంబానికి. ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ తిరిగే హుసేన్ పూర్తిగా మారిపోయాడు. కాఫీలకీ సినిమాలకీ రావడం మానేశాడు. వచ్చినా, నా డబ్బులు నేనే పెట్టుకుంటాను అని పంతం పట్టే వాడు.

దీపావళి రోజు దేనికో ఇంటికొస్తే భోజనానికుండమన్నారు శీనూ వాళ్ళింట్లో. అబ్బే వద్దూ వద్దూ అని మొహమాట పడ్డాడు. సుబ్బారావు గారు చాలా నొచ్చుకున్నారు, 'ఏరా, మీ బాపూకీ నాకూ ఉన్న స్నేహం తెలియదట్రా, నా స్నేహితుడి కొడుకు పండుగ రోజు నా ఇంట్లో భోంచేయాలని నాకు ఉండదట్రా' అన్నారు. ఆయన గొంతులో కోపం కన్నా బాధ ఎక్కువ కనిపించింది. హుసేన్ ఆపుకోలేకుండా ఏడ్చేశాడు, 'మాఫ్ కర్నా చాచా' అంటూ.

అతి కష్టం మీద మూడో సంవత్సరం పూర్తి చేసి "ఇక లాభం లేదు. నేను ఏదో ఉద్యోగం వెతుక్కుని కుటుంబాన్ని పోషించాలీ, బెహన్ కి పెళ్ళి చేయాలీ" అని హైద్రాబాద్ లో వాళ్ళ సలీం చాచా వాళ్ళింటికి వెళ్ళిపోయారు కుటుంబమంతా. మళ్ళీ కాలం కలిసొస్తే తిరిగొచ్చి పూర్తి చేయవచ్చు అని కాలేజ్ లో 'లీవ్' మాత్రం తీసుకునేటట్లు ఒప్పించగలిగారు. హుసేన్ కి మాత్రం తను తిరిగి రాగలనని ఇంజినీరింగ్ పూర్తి చేయగలనని ఏ మాత్రం నమ్మకం లేదు.

సలీం చాచా హైద్రాబాదులో టాక్సీ నడుపుతాడు, అదృష్టమున్న రోజు విజయవాడకో, రాజమండ్రికో మరో చోటకో బేరాలు దొఱుకుతాయి. ఏదో మామూలు సంపాదనే కానీ, అన్నయ్య కుటుంబం కాకినాడలో పడ్తున్న కష్టాలు చూసి ఊరుకోలేక పిలిచి ఇంట్లో పెట్టుకున్నాడు. తెలిసిన వాళ్ళ దగ్గఱ హుసేన్ కి ఒక చిన్న ఉద్యోగం ఇప్పించాడు. హుసేన్ చదువు అర్ధాంతరంగా ఆగిపోయిందని చాలా బాధ పడేవాడు.

కృష్ణప్రియకీ వాళ్ళ గేంగంతటికీ చదువైపోయింది. అందరికీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలెక్ట్రిసిటీ బోర్డ్ (APSEB) లో ఉద్యోగాలు ఖాయం. ఆర్డర్ రావడం, వెళ్ళి చేరడం అంతే.

అదే వేసవిలో శీనూ వాళ్ళ పక్కింటి వాళ్ళింటికి చుట్టాలు రావడం, వాళ్ళమ్మాయి ప్రభావతి కీ శీను కీ ఈడూ జోడని అందరూ అనుకోవడం, సంబంధం కుదిరిపోవడం అంతా కథ చెప్పినట్లైపోయింది.

శీను పెళ్ళి కుదిరిన రెండు వారాలకే తమాషాగా కృష్ణ పెళ్ళి కూడా కుదిరిపోయింది. జగన్నాథం అని ఒ. ఎన్. జి. సి (O. N. G. C.) లో ఇంజినీరు, అస్సాం లో ఎక్కడో ఉద్యోగం. అతను అనుకోకుండా ఒక పది రోజుల శెలవ మీద ఇంటికి విశాఖపట్నం వచ్చాడు. అతనికి కృష్ణా వాళ్ళ సుబ్రహ్మణ్యం బావ గారు ఇంజినీరింగ్ లో ఫిజిక్స్ చెప్పారు. ఎందుకో ఆయనంటే అతనికి చాలా గౌరవం. ఆయన్ని చూడడానికి కాకినాడ వస్తే ఆయన మా కజిన్ చదువైపోయింది పెళ్ళికున్నది చూడు అని మాటలు కలిపాడు. కృష్ణ తనకి అప్పుడే పెళ్ళి వద్దనుకున్నది కానీ సుబ్రహ్మణ్యం గారు, చూస్తే ఏంపోయింది, నచ్చకపోతే వద్దని చెప్పేయి అని బలవంత పెట్టారు.

జగన్నాథం కృష్ణప్రియతో నేరుగా మాట్లాడాలన్నాడు. "జీవిత నావకి భార్యా భర్తా ఒకరు చుక్కానైతే ఒకరు తెడ్డు. ఒకరు తక్కువ ఒకరు ఎక్కువా లేదు. మీరు చిన్నప్పటి నుంచీ చాలా స్వతంత్ర భావాలున్నవారని ధైర్యమున్న వారని సుబ్రహ్మణ్యం మాష్టారు చెప్పారు. నా ఉద్యోగంలో నాకు కేంపులు ఎక్కువ, ప్రమాదాలు కూడా ఎక్కువే. కాబట్టి నేను నాకు భార్యే కాదు, నేను ఇంట్లో ఉన్నా లేకపోయినా పిల్లలకి తల్లీ తండ్రీ గురువు ఐ పిల్లల్ని చక్కగా తీర్చి దిద్దే మహిళ కోసం చూస్తున్నాను. అంతే కాదు, మా ఉద్యోగంలో మాకు పైకి చెప్పని ఒక ధర్మం ఒకటి ఉన్నది. అస్సాంలో అంతా వెనకబడిన వాళ్ళెక్కువ. ఒ. ఎన్. జి. సి. వాళ్ళొచ్చి వాళ్ళ సంపదంతా కొల్ల గొద్తున్నారని ఒక కోపం. అది కేవలం చదువు లేనందువలన వచ్చిన దురభిప్రాయం. వాళ్ళని దగ్గరికి పిల్చి విద్యావంతులని చేయాలి. ఆ ఉద్యమంలో కూడా నా భార్య నాతో నడుం కట్టాలి. వీటన్నింటికీ మీరు తగిన యువతి అనుకుంటున్నాను" అన్నాడు.

కృష్ణకి అతని మాటలు చాలా నచ్చాయి. కేవలం ఒక ఇంజినీరవుదామని కలలు కన్న తనకి ఒక నాయకురాలయ్యే అవకాశం అనిపించింది. నచ్చలేదని ఎలా చెప్పాలో కూడా తెలియలేదు.

నాకు శెలవు ఓ పట్టాన దొరకదు, ఈ వారంలోనే పెళ్ళి ఐపోవాలన్నాడు జగన్నాథం. పరంధామయ్య గారికి అనసూయమ్మ గారికి ఒప్పుకోక తప్పలేదు. అక్కయ్య గారి తమ్ముళ్ళంతా కలిసి పెళ్ళి చక్కగా జరిపించేశారు, కృష్ణ వెంటనే కాపురానికీ వెళ్ళిపోయింది.

శీను వాళ్ళ గేంగ్ అందరూ హైద్రబాదులో ఎలెక్ట్రిసిటీ బోర్డు ఉద్యోగాల్లో చేరి పోయారు. తరువాత ఓ ఆరునెలలకి జరిగిన శీను పెళ్ళికి జగన్నాథం కృష్ణా ఇద్దరు వచ్చారు. కృష్ణప్రియ కి అడబడచు సత్కారాలు జరిపించారు సంతోషంగా. మా అమ్మాయి చాలా ప్రాక్టికల్ మనిషి. You will enjoy her attitudes అన్నారు ప్రభావతీ వాళ్ళ నాన్నగారు శీనుతో.

★★★

ఒక సంవత్సరంలో హైద్రాబాదు ప్రయాణాలు, ఔట్ స్టేషన్ బేరాలు బాగా పెరిగాయి. సలీం చాచా ఆర్ధికంగా పరిస్థితి బాగా మెరుగైంది. హుసేన్ ని పిలిచి కాకినాడ వెళ్ళి చదువు పూర్తి చేయమన్నాడు. హుసేన్ మాత్రం

చాచా మీద అంత బరువు పెట్టడం ఇష్టం లేక వెళ్ళనన్నాడు. అమ్మనీ, బెహన్ నీ నీ మీద వదలడమే కాక నా చదువు ఖర్చు కూడానా. నీ కర్జా (ఋణం) ఇంకా ఎంత పెంచుకొమ్మంటావు అన్నాడు.

సలీం చాచా నవ్వి దానికి ఉపాయం చెప్పాడు, "నువ్వు ఇంజినీరువయ్యి మంచి ఉద్యోగం సంపాదించి నీ బెహన్ కీ, నా బేటీ కీ ఇద్దరికీ నికా నువ్వే చేయించి అప్పు తీర్చు" అన్నాడు. ఆ ఒప్పందం మీద మళ్ళీ కాకినాడ వెళ్ళాడు హుసేన్, తనకంత మంచి చాచానిచ్చిన ఖుదా కి షుక్రియా చెప్పుకుంటూ. కాకినాడలో సుబ్బారావు గారు తమ ఇంట్లోనే ఉండమంటే ససేమిరా కాదని చివరికి వాళ్ళింట్లో ఒక గదిలో ఉండేటట్లు, భోజనం మాత్రం బయట చేసేటట్టు ఒప్పుకున్నాడు.

సలీం చాచా స్నేహితుడొకతను దుబాయ్ లో కంట్రాక్టర్ గా చేస్తూంటాడు. హుసేన్ డిగ్రీ కాగానే, నాకు ఒక ఎలెక్ట్రికల్ ఇంజినీరు కావాలి అని అతన్ని దుబాయ్ తీసుకెళ్ళి పోయాడు.

★★★

చూస్తూండగానే కాలం గిఱ్ఱున తిరిగిపోయింది. హుసేన్ కీ, వాళ్ళ బేహన్ కీ, సలీం చాచా కూతురికీ పెళ్ళిళ్ళైపోయాయి. సలీం చాచా పెద్ద వాడైపోయి టాక్సీ నడపడం మానేసి ఇంటికి దగ్గర్లో కార్ల రిపేర్ షాపులో ఉద్యోగం చేస్తున్నాడు. కృష్ణకిద్దరు పిల్లలు, శీనూకి ఒక కొడుకు. శీనూకి ఉద్యోగంలో మంచి పేరొచ్చింది. చాలా తొందరగా A. E. గా ప్రమోషన్ తో కాకినాడ లో వేశారు.

హుసేన్ కి ఒకటి తరువాత ఒకటిగా దుబాయ్ లో ప్రాజెక్టు్లు. కొన్నాళ్ళు కంపెనీ హెడ్ క్వార్టర్స్ బెంగుళూరు లో, కొన్నాళ్ళు దుబాయ్ లో అటూ ఇటూ తిరగడం ఔతోంది.

★★★

కొత్త సినిమా మొదటి రోజు మేటినీ షో, కాకినాడ స్వప్నా థియేటర్లో. శీనూ, ప్రభావతీ కష్టం మీద టిక్కట్లు సంపాదించి వెళ్ళారు. ఇంటర్వల్లో వాళ్ళ బుడ్డడిని తీసుకుని కిందకొచ్చాడు శీను. కింద కోలాహలంలో వాళ్ళ గేంగు శంకర్రావు కలిశాడు. " సినిమా కొచ్చావా, ఐనా మొహం అలా ఉందేమిటి? " అన్నాడు. శంకర్రావుకు ఏడుపొక్కటే తక్కువ.

"జగన్నాథం బావ గారు పోయార్రా, రెండు నెలైందట" అన్నాడు మరో ఉపోద్ఘాతం లేకుండా.

రెండు నెలైందట అదేమిటి ఇప్పటి దాకా మనకి తెలియక పోవడేమిటి? " అన్నాడు శీను.

"నిన్న హైద్రాబాద్లో కృష్ణక్కయ్య కలిసింది, వాళ్ళ పిల్లలకి ఏవో బట్టలు కొంటూ. నన్ను చూసీ చూడనట్లు పక్కకి వెళిపోతూంటే నేనే వెళ్ళి పలకరించాను. మొహం మీద బొట్టు లేదేమిటి అంటే అప్పుడు చెప్పింది. లేకపోతే చెప్పేది కూడా కాదేమో. బావగారూ వాళ్ళు వెళ్తున్న జీపు ఘాట్ రోడ్ లో తిరగబడి, డ్రైవరూ, బావగారూ అక్కడికక్కడే పోయారట. వెనక సీట్లో కూర్చున్న మరో ఇంజినీర్ కి బాగా దెబ్బలు తగిలాయట. దహన క్రియలు కాగానే తను వచ్చేసిందట.

మనకెవరికీ చెప్పద్దనుకుందట. ఆ కాస్తా చెప్పేసి గబగబా వెళ్ళిపోయింది, ఏడుపాపుకుంటూనో ఏమిటో అనిపించింది. వెళ్ళే ముందు మన వాళ్ళెవరికీ చెప్పద్దని చెప్పింది. నీకు అసలు చెప్పద్దని నాచేత ఒట్టేయించుకుంది, కానీ చెప్పకుండా ఉండలేకపోయాను. మీ ఇంటికెళ్తే పక్కింటి వాళ్ళు చెప్పారు, ఈ సినిమాకొచ్చావని. అందుకే ఇక్కడికి వచ్చాను" అన్నాడు బావురుమనడం ఒకటే తక్కువ శంకరానికి.

ఖైరతాబాద్ లో వాళ్ళ పిన్ని గారింట్లోనే ఉన్నది. బావగారి నాన్న గారు బెంగుళూరు లో రిటైరయ్యారట. అక్కడే స్థిరపడదామని ఒక చిన్న పోర్షన్ లో అద్దెకుంటూ సొంత ఇల్లు కట్టించుకుంటున్నారట. అది తయారవగానే తను అక్కడికి వెళ్ళి పోతుందట" అని చెప్పాడు.

శీనూకి మనసాగలేదు. హాల్ లోకి వెళ్ళి తనకి సంగతి చెప్పి, "ప్రభా వీణ్ణి తీసుకుని నువ్వింటికెళ్ళు, నేను హైద్రాబాద్ వెళ్ళి కృష్ణక్కయ్యని చూసొస్తాను" అన్నాడు. ప్రభ వెంటనే, "హైద్రాబాద్ బస్సు రాత్రి ఏడింటికి కదండీ. శంకరన్నయ్య గారు వెళ్ళి టికెట్ తీసుకుంటారు, మీరింటికొచ్చి కాస్త తిని బ్రషూ పేస్టూ ఓ సంచిలో సర్దుకుని వెళ్దురుగానీ" అని సమాధాన పరచింది. శీనుకి కృష్ణక్కయ్యని చూసే లోపల మరేమీ చేయబుద్ధి వేయడం లేదు కాని ప్రభావతి చెప్పింది కాదనలేక పోయాడు.

★★★

కృష్ణప్రియ ముందు వసారాలో కూర్చుని పిల్లలకి అన్నం పెడ్తోంది. శీనుని చూడగానే లేచి నుల్చుంది. 'కృష్ణక్కయ్యా ఏమిటిది' అని ఇంకేదో అనబోయాడు.

'అక్కయ్యా అన్న ఆ పిలుపు నువ్వు మానవు కదా' అని చివాలున వెనక్కి తిరిగి పుట్టెడు దుఃఖంతో లోపలికి వెళ్ళిపోయి తలుపేసుకుంది.

శీనుకి నెత్తి మీద ఒక 220KV HT line పడ్డట్లైంది. 'కృష్ణా' అని అరిచాడు,

జీవితంలో మొదటి సారి ఆ పిలుపు.

ఇంతలో కృష్ణ వాళ్ళ పిన్ని గారమ్మాయి బయటకొచ్చి. "ఈ రెండు నెలలూ పిల్లలు బెంబేలైపోతారని ఏడుపాపుకుందన్నయ్యా. అందుకే మీ గేంగ్ వాళ్ళెవరికీ చెప్పలేదు. కానీ నిన్ను చూశేటప్పటికి కంట్రోల్ చేసుకో లేక పోయింది" అన్నది.

శీనుకి ఆ మాటలేవీ వినిపించినట్టు లేదు. గిరుక్కున వెనక్కి తిరిగి రోడ్డెక్కాడు. 'అన్నయ్యా భోంచేసి వెళ్ళండి' అన్న పిలుపతనికి వినపడలేదు. వినిపించినా బుఱ్ఱలోకెక్కలేదు. మనసంతా అయోమయం ఐపోయింది.

అలా బయటకొచ్చి తను ఏ రోడ్లో నడిచాడో, ఎక్కడెక్కడ తిరిగాడో ఆలోచించినా అంతు బట్టని విషయం. ఆలోచించే ఓపికా లేదు, అసలు ఆలోచించే ఉద్దేశ్యం కూడా లేదు.

సాయంత్రం ఐదు గంటలకి ఒక్క మాటు చూస్తే అది గౌలిగుడా బస్ స్టాండు. బుఱ్ఱంతా ఇంకా అయోమయంగానే ఉన్నది.

ఇంతలో 'ఒరేయ్ ఇక్కడున్నావేమిటి' అని పిలుపు వినిపించింది. ఆ గొంతెక్కడో విన్నట్లుంది, కానీ గుర్తు రాలేదు. ముందుకి సాగబోయాడు. 'ఏమిట్రా అలా చూస్తావు, అలా వెళిపోతున్నావు? నేను హుసేన్ని, అసలా రేగిన జుట్టేమిటీ, మొహంలో ఆ చూపేమిటీ' అని కోప్పడిందా గొంతు.

'జగన్నాథం బావ గారు పోయార్రా' అన్నాడు ఇంకా ఎక్కడో చూస్తూనే.

"వాట్, ఎప్పుడూ, ఎలా?" అన్నాడు హుసేన్. జరిగిన ఏక్సిడెంట్ సంగతీ, కాకినాడ వాళ్ళెవరికీ తెలియజేయని సంగతీ చెప్పాడు శీను. తనిప్పుడు కాకినాడ బస్సు కోసం వెతుకుతున్నానన్నాడు. కృష్ణ వేసిన నిష్టూరం సంగతి చెప్పలేదు. పొద్దుట్నించీ దిక్కు తెలియకుండా తిరుగుతున్న సంగతీ చెప్పలేదు.

"నేను ఫామిలీతో రెండు వారాలు శెలవు మీద మా సలీం చాచా గారింటికొచ్చాను. ఆయన దోస్త్ ఖాదర్ టాక్సీ కోసం ఇక్కడకొచ్చాను, రేపు వరంగల్ కి వెళ్ళడానికి" అన్నాడు.

"అలాగా ఐతే వెళ్ళు" అని ముందుకి కదిలాడు శీను.

శీనూ పరిస్థితి చూస్తే వీడు కాకినాడ చేర్తాడా అని అనుమానం వేసింది హుసేన్ కి.

"ఒరేయి నేను వరంగల్ కి ఎప్పుడన్నా వెళ్ళచ్చు కంగారు లేదు, పద నీతో కాకినాడ వస్తాను" అన్నాడు.

"నాకెవరి సాయంఅక్కర్లేదు, కంపెనీ అక్కర్లేదు, నే వెళ్ళగలను" అన్నాడు కోపంగా.

'చుప్ రే, బేవకూఫ్', అని వెంటనే కాకినాడకి రానూ బోనూ టాక్సీ మాట్లాడాడు హుసేన్.

టాక్సీలో యాంత్రికంగా కూర్చున్నాడు శీను. దారిలో ఒక పబ్లిక్ ఫోన్ (P. C. O.) దగ్గర ఆగి ఫోన్ చేసి సంగతి చెప్పి రెండు రోజుల్లో తిరిగొస్తానని భార్యకి మాటిచ్చాడు హుసేన్.

'తన ఉద్యోగంలో జరిగేప్రమాదాలు తెలుసు కాబట్టే, తన పిల్లల కోసం సమర్థురాలైన భార్యని కోరుకున్నారు బావ గారు' అని సముదాయించడానికి ప్రయత్నించాడు. 'అది కాదు లేరా' అన్నాడు శీను. 'ఔర్ క్యా బాత్ హై' అని అడిగితే సమాధానం చెప్పలేదు. మొహం పక్కకి తిప్పుకున్నాడు.

ఒకటికి పది సార్లు అడిగితే బయట పడ్డాడు,

'కృష్ణ, మా ఇద్దరి మధ్యా ఉన్నది తోబుట్టువుల సంబంధం అనుకోలేదు', అని.

'అక్కయ్యా అన్న ఆ పిలుపు నువ్వు మానవు కదా' అని తను చేసిన నిష్టూరం సంగతి చెప్పాడు. కాకినాడలో చదువుకునేటప్పుడు అలా ఎన్ని సార్లు చెప్పినా తనకి అర్ధం కాలేదని చెప్పాడు.

బుఱ్ఱ తిరిగిపోవడం ఈ మాటు హుసేన్ వంతైంది. జరిగినదంతా సినిమా రీల్లాగా గుర్తుకొచ్చింది హుసేన్ కి.

'మొదటి సారి నిన్ను చూసినప్పుడు దీదీ మొహంలో చూసిన ఖుషీ నేనెప్పుడూ మర్చిపోలేనురా. కానీ ఆ ఖుషీకి అర్ధం ఇప్పుడు తెలుస్తున్నది. నీ మీద తనకో ఆరాధన ఉన్నదన్న మాట. ఆలోచిస్తే అసలు మీ బామ్మ గారు కూడా తన మొహంలో ఆ సంగతి వెంటనే గమనించినట్లున్నారు. అందుకే అక్కయ్య అని రిష్తా కలిపేసి మీ ఇద్దరి మధ్య ఓ సడెన్ బ్రేక్ వేశారనిపిస్తున్నది' అన్నాడు.

'అంతే కాదు, నా పెళ్ళి కుదిరిందని చెప్పడానికి వెళ్తే, మీ అక్కయ్య ఉన్నట్లుండి వాళ్ళత్తయ్యని చూసొస్తానని వెళ్ళిందయ్యా అని చెప్పారు వాళ్ళమ్మ గారు. అదేమిటీ అలా చెప్పా పెట్టకుండా వెళ్ళిపోయావంటే, నేను చేశేవన్నీ నీకు చెప్పాలా అని చాలా కోపంగా సమాధానం చెప్పింది. ఎందుకంత కోపమొచ్చింది ఈ చిన్న విషయానికీ అని ఆశ్చర్య పోయాను' అన్నాడు శీను.

"నీకు తనమీద ప్రేమ లేని విషయన్ని ఎలా హజం (జీర్ణం) చేసుకోవాలో తెలియక అలా మొహం చాటు చేసుకుందన మాట. అందుకే అంత గుస్సా గూడా వచ్చి ఉంటుంది. అసలాలోచిస్తుంటే ఇంకోటనిపిస్తున్నది రా. జగన్నాథం బావ గారు అలా అనుకోకుండా వచ్చారంటే – సుబ్రహ్మణ్యం మాష్టారు నీ పెళ్ళి సంబంధం కుదరగానే, ఓహో వీళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోరన్న మాట అని నిర్ధారణ చేసుకుని ఆయన్ని ఓ టెలిగ్రాం ఇచ్చి పిలిపించి ఉండచ్చు" అన్నాడు హుసేన్.

'ఆ మాత్రం ఆలోచన నాకూ రాలేక పోదు లేవోయ్. కానీ మరిప్పుడేంచేయాలీ అన్నదే అర్ధం కావడంలేదు' అన్నాడు.

'ఇప్పుడేంచేస్తావురా, వక్త్ కో వాపస్ ఘుమా నహీ సక్తేహో నా (కాలాన్ని వెనక్కి తిప్పలేవు కదా)' అన్నాడు హుసేన్.

'అదేనోయ్ బాధ' సమాధానం చెప్పాడు. 'నేను కృష్ణని పెళ్ళి చేసుకుంటే ఈ బాధలన్ని వచ్చేవి కాదు కదా. ఇప్పుడు చూడు కృష్ణ ఎంత బాధల్లో పడిపోయిందో' అన్నాడు.

'జరా సోచో, దీదీ మీద నీకెలాటి ప్రేమా కలగలేదు, అప్పుడే కాదు, ఇవాళ దాకా కూడా. మీ బామ్మ గారి ఒక్క మాటతో నువ్వు వేరే లైన్ లోకెళ్ళిపోయావ్ కాబట్టి నీకు బాధెందుకు' అన్నాడు.

దానికి సమాధానం చెప్పకుండా మాట మార్చి 'అసలు ప్రభావతి నన్నేమీ చేయనీయలేదురా. నీలాగా దుబాయ్ వచ్చే ఛాన్సు రెండు సార్లొచ్చింది. తనొద్దంది. కృష్ణైతే సై కి సై అని ముందుకు దూకేది' అన్నాడు.

'ప్రభావతి బెహన్ ఎందుకొద్దంది' అనడిగాడు హుసేన్.

"పెద్ద వాళ్ళనొదిలి ఎలా వెళ్తామంది. ఢిల్లీలో డిప్యుటేషన్ కి పెళ్ళినప్పుడే అత్తయ్య గారికి సుస్తీ చేస్తే ఎంత కష్టమైందీ అన్నది. చెప్పి చూశాను. ఢిల్లీ నుంచి రైల్లో కాకినాడకి రోజున్నర ప్రయాణం. దుబాయ్ నుంచి ప్లేన్ లో కొన్ని గంటలు మాత్రమే, అంతే కాదు, దుబాయ్ లో ఉద్యోగమైతే అక్కడి నుంచి ప్లేన్ టికట్టు కొనగలం. ఢిల్లీలో ఉద్యోగంలో రైల్ టిక్కెట్టే గొప్ప అని. విన్నది కాదు. తన ప్రాక్టికల్ భావాలతో మాది చాలా సాదా పెసరట్టు జీవితం ఐపోయింది" అన్నాడు.

"సరే, ప్రభావతి బెహన్ సాదా పెసరట్టు మనిషి. మరి, కృష్ణక్కయ్య, మొదటి నుండీ లీడర్. అటువంటి లీడర్ని భార్యగా నువ్వు భరించ గలిగే వాడివా? "

'ఏదో ఒకటి సర్దుకుపోయే వాళ్ళం', అని సమాధానమిచ్చాడు శీను.

'ఓకే, మరి మామూలు భార్యగా సాదా పెసరట్టు జీవితంతో తను సర్దుకునేదా? " అన్న హుసేన్ ప్రశ్నకి సమాధానం దొరక లేదు శీనుకి.

'నీ జీవితంలో నువ్వేమీ తక్కువ సాధించలేదు. నీ బేచ్ లో వాళ్ళకి ఎంతమందికి నీలాగా ప్రమోషన్ వచ్చింది, ఆలోచించు' అన్నాడు హుసేన్.

"అదంతా నల్లేరు మీద పోయే బండి లాంటి normal progress. Nothing unusual. కానీ, నేను కృష్ణకి ఎంత అన్యాయం చేశాను అన్న బాధ నన్ను వదలడం లేద"న్నాడు.

'ఓ పని చేయి, కాకినాడ వెళ్ళగానే మా కాజీ గారి దగ్గరికి తీసుకెళ్తాను, ఇస్లాం కుబూల్ కర్లో. కృష్ణక్కయ్యని రెండో భార్యగా చేసుకో, తననే కాదు, ఇంకో ఇద్దర్ని కూడా చేసుకోవచ్చు. ఇస్లాం మే చార్ బీబీకే సాథ్ నికా కర్ సక్తే హో' అన్నాడు.

"ఏడిశావు లేవోయ్, నీకు హిందీ వచ్చునని మాకు తెలుసులే" అని తల ఎగరేశాడు.

"ఒరేయ్, నాకు హిందీ వచ్చు, అరాబిక్ వచ్చు, ఫార్సీ కూడా వచ్చు, తెలుగూ, ఇంగ్లీషూ సరే సరి. నాకెన్ని భాషలొచ్చని కాదు సవాల్, ఎన్ని భాషల్లో తిట్టే నీకు బుద్ధొస్తుంది" అని.

"అహా అలాగా" అని రుంజుకున్నాడు కానీ, నోరు మాత్రం మూశాడు, మెల్లిగా నిద్రలోకి జారుకున్నాడు.

ఇంటికి చేరగానే "అదేమిటండీ ఓ రోజైనా ఉంటారనుకున్నాను వదిన గారిని ఓదారుస్తూ, ఐనా అలా రేగిపోయిన జుట్టేమిటి, ఆ ముఖమేమిటి? వేణ్ణీళ్ళు పెట్టాను, స్నానం చేయండి. కాస్త భోంచేసి పడుకుందురు కాని" అన్నది.

"డ్రైవర్ గారు కూడా మాతో పాటే ఉంటాడు, భోంచేస్తాడు" అని చెప్పాడు హుసేన్.

"ఆమాట మీరు నాకు చెప్పాలా అన్నయ్యా" అని వంటింట్లోకెళ్ళిపోయింది 'ప్రాక్టికల్ ప్రభావతి'.

★★★

పరిగెత్తే కాలం మరో ఐదేళ్ళు గడిచిపోయింది. కృష్ణక్కయ్య వాళ్ళింటి చుట్టూ ఉన్న బీద పిల్లలకి చదువు చెప్తోందని విని ఫోన్ చేశాడు, దీదీ, నీకు డిగ్రీకి సరిపడా ఉద్యోగం నేనివ్వగలను రమ్మని. ఒకటి రెండు సార్లు ఫోన్ చేస్తే గానీ పలకలేదు. "ఆయన ఉద్యోగం చేస్తూ పోయారు (On duty death) కాబట్టి ఒ. ఎన్. జి. సి. వాళ్ళు ఇస్తున్నది, మామగారి పెన్షనూ అన్ని కలిసి బాగానే సరిపోతోంది, ఇలా బీద పిల్లలకి చదువు చెప్తూంటే చాలా ఆనందంగా ఉంటోంది హుసేన్" అన్నది.

అంతే కాకుండా తనతో ఉంటే పాత గాయాలు కెలికినట్లు అవుతుంది అనుకుంటోందో ఏమో అని హుసేన్ మళ్ళీ ఆ మాటెత్తలేదు. అప్పుడప్పుడూ ఫోన్ చేసి కుశలం మాత్రం అడిగే వాడు. తను చదువు చెప్పే పిల్లలకి పుస్తకాలూ అవీ కొనడానికి సహాయం మాత్రం చేశేవాడు.

★★★

హుసేన్ ఒక రోజు ఆఫీసుకొస్తూ దారిలో బేంక్ కి వెళ్ళి కొత్త ప్రాజెక్ట్ కి లోన్ అప్లై చేసి వచ్చేటప్పటికి సెక్రెటరీ మేరీ ఎదురొచ్చింది కంగారుగా. “కాకినాడ నుంచి XXX P. P. call సర్, సంగతేమిటో నాకు చెప్పలేదు. ఒక అరగంటలో మళ్ళీ చేయమన్నాను, మీరెక్కడికీ వెళ్ళకండి సార్“ అన్నది.

XXX Calls అంటే Highest priority trunk calls. అవి ఏదో పెద్ద ప్రమాదమో, చావు కబురో ఐతే మాత్రమే చేస్తారు. కిస్కో క్యా హోగయా (ఎవరికేమైందబ్బా) అనుకుంటూ కుర్చీలో కూలబడ్డాడు. ఇంతలోకే మేరీ గొంతు వినిపించింది. “వచ్చారండి మేడం, కలపండి“ అని.

కాకినాడ నించి మాట్లాడేది శంకరం. “ఏమిట్రా ఏమైంది?” అన్నాడు.

హుసేన్ శీను పోయాడు రా. కొత్త గా చేరిన వాళ్ళకి H. T. switching లో training ఇస్తూ wrong sequence చేశాడట. పెద్ద మంటలొచ్చి మాడి మసై పోయాడు. మిగిలిన కాస్తకీ రేపు దహనం. నువ్వూ కృష్ణక్కయ్యా వస్తారేమోనని చేస్తున్నాను హుసేన్ అన్నాడు.

హుసేన్ తప్పకుండా వస్తాను, తనని కూడా తీసుకు రావడానికి ప్రయత్నిస్తాను. హౌరా మెయిల్లో వస్తాను, నా కోసం ఆపండి హుసేన్ అని చెప్పి పెట్టేశాడు.

అని టైం చూసుకున్నాడు. వెంటనే పరిగెత్తుకెళ్తే బృందావన్ ఎక్స్ప్రెస్ దొరుకుతుంది, అది తప్పితే సమయానికి కాకినాడ చేరే మార్గం లేదు.

వెంటనే మేరీ ని పిలిచి ఏర్పాట్లు ఏకరువు పెట్టేశాడు.

హుసేన్ కృష్ణప్రియ గారికి ఫోన్ చేసి సంగతి చెప్పి, తన కోసం వాళ్ళింటికి వస్తున్నానని చెప్పు.

నేను వెంటనే కంపెనీ కార్లో జయనగర్ వెళ్ళి తనని పికప్ (pickup) చేస్తాను.

ఓ మూడు వేలు ఎడ్వాన్స్ తీసుకుని వెంకట్ కిచ్చి స్టేషన్ కి పంపించు, ఇవాళ బృందావన్ లో మద్రాసు కీ, రాత్రి హౌరా మెయిల్లో మద్రాసు నుంచి సామర్లకోటకీ రెండు టిక్కెట్లు – ఏ క్లాస్ లో దొరికితే ఆ క్లాస్ లో. నాకొకటి, గుంటూరు కృష్ణప్రియ గారికొకటి. హుసేన్

నువ్వు మాఇంటికి ఫోన్ చేసి సంగతి చెప్పి, ఓ నాలుగు రోజులకి బట్టలు ఒక సూట్ కేస్ లో సర్దమని చెప్పు.

నాకు, తనకి ఫోన్ చేసి చెప్పే టైం లేదని చెప్పు. నువ్వెళ్ళి ఆ సూట్ కేసు తీసుకుని స్టేషను కి రా.

ఆ అన్నట్లు, టిక్కట్లు దొరక పోతే కంపెనీ కారే తీసుకుని కాకినాడ వెళ్ళిపోతానని బాస్ కి చెప్పు. ఓ పది వేలు అడ్వాన్స్ తీసుకుని రా, కారు తీసుకెళ్తే పెట్రోలు కి కావాలి. హుసేన్

అని గబా గబా చెప్పేసి పరిగెడ్తూ కిందకి వెళ్ళిపోయాడు.

★★★

కాకినాడ చేరగానే శంకరం ముందు కలిశాడు, 'అసలు బావ గారు పోయినప్పటి నుంచీ వాడొక మాదిరైపోయాడురా. పరధ్యానం ఎక్కువైందా అనిపించింది. లేకపోతే అందరికీ ట్రైనింగ్ ఇచ్చే వాడు, వాడు తప్పు పద్ధతిలో స్విచ్చింగ్ చేయడమేమిటి' అన్నాడు. హుసేన్ మాట్లాడ లేదు.

కృష్ణక్కయ్యని చూడగానే బావురుమంది ప్రభావతి, వదినగారూ అంటూ.

వదినగారా, అక్కయ్య గారా అని తనకొచ్చిన అనుమానం తనలోనే ఉంచుకున్నాడు హుసేన్.

★★★

చివరి మాట

ఇది, నా చుట్టు పక్కల జరిగిన కొన్ని విషయాలని కలిపి కుట్టి చేసిన కథనం, కల్పన.

1960 ప్రాంతాలలో (సరిగ్గా ఏ సంవత్సరమో నాకిప్పుడు గుర్తు లేదు) ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్ లో ఒకే ఒక అమ్మాయి చేరింది. ఆవిడ ఎంతో ధైర్యమున్న మనిషి అని అనుకునేవాళ్ళం. ఆవిడని అప్పటి ప్రిన్సిపాల్ గారు చాలా కాపాడారని విన్నాం. అంతకన్నా ఆవిడ గురించి నాకింకేమీ తెలియదు. ధైర్యశాలి ఐన కృష్ణప్రియ కి నమూనాగా ఆవిడని ఎంచుకున్నాను.

COMMENTS